విలేకరులు కావలెను
ఆంధ్ర తెలంగాణ రెండు తెలుగు రాష్ట్రాలలో
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్స్, మండల
రిపోర్టర్, కంట్రిబ్యూటర్స్, యాడ్ ఎగ్జిక్యూటివ్స్, కావలెను
తెలుగు భాషపై అవగాహన, వార్తలు రాయగల సత్తా
ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును
JBN NEWS 24/7
MOBILE : 8886090199, 9885211993,

అనంత ప్రభ
తెలుగు దిన పత్రిక



అనంతపురం 5
శ్రీ సత్యసాయి
గురువారం 19 ఫిబ్రవరి 2026

# రాయలసీమ ఎత్తిపోతల పథకం పూర్తి చేయడం హంద్రీనీవా సామర్థ్యం పెంపుపై ఉద్యమానికి శ్రీకారం

అనంతపురం, ఫిబ్రవరి 18 (అనంత ప్రభ)
అనంతపురంలోని వైఎస్ఆర్‌సీపీ జిల్లా కార్యాలయంలో వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, పార్లమెంట్ పరిశీలకులు నరేష్‌రెడ్డి, సమన్వయకర్తలు విశ్వేశ్వరరెడ్డి, శైలజానాథ్, తలారి రంగయ్య, వై.వెంకట్రామిరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, మెట్టు గోవిందరెడ్డి ప్రెస్‌మీట్

రాయలసీమ ఎత్తిపోతల పథకం పూర్తి చేయడం, హంద్రీనీవా సామర్థ్యం పెంపుపై ఉద్యమానికి శ్రీకారం చుడుతున్నట్లు ప్రకటించిన నాయకులు

అనంత వెంకటరామిరెడ్డి కామెంట్స్ :

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు రాయలసీమ వాసిగా ఉండి ఇక్కడి ప్రయోజనాలు కాపాడడంలో విఫలం అవుతున్నారు.
తమ రాష్ట్ర ప్రయోజనాలు కాపాడుకునే విషయంలో తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక ప్రభుత్వాలు ముందుచూపుతో వ్యవహరిస్తుంటే చంద్రబాబు మాత్రం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.
చంద్రబాబు ఎప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్నా రాష్ట్ర ప్రయోజనాలు ఆయనకు పట్టవు.
కర్ణాటకలో ఆల్మట్టి డ్యాం ఎత్తు పెంచుతున్నా చంద్రబాబు పట్టించుకోవడం లేదు. గతంలో ఆల్మట్టి డ్యాం ఎత్తు 506.84 మీటర్ల నుంచి 519.24 మీటర్ల ఎత్తుకు పెంచారు. అప్పుడు దేవేగౌడ ప్రధానిగా ఉంటే తెలుగుదేశం పార్టీ భాగస్వామిగా ఉంది.
తాజాగా మరోసారి ఆల్మట్టి డ్యాం ఎత్తును 524 మీటర్లకు పెంచుతున్నారు. గతంలో 124 టీఎంసీల నిల్వ సామర్థం ఉంటే ఇప్పుడు 240 టీఎంసీల సామర్థానికి పెంచుతున్నారు. దీనివల్ల మన రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బతింటున్నా చంద్రబాబు పట్టించుకోవడం లేదు.
రాయలసీమలోని సాగునీటి ప్రాజెక్టులకు శ్రీశైలం ప్రాజెక్టే ఆధారం. గాలేరు నగరి, తెలుగు గంగ, వెలిగొండ, హంద్రీనీవా అన్నీ శ్రీశైలం ప్రాజెక్ట్‌పైనే ఆధారపడి ఉన్నాయి.
రాయలసీమ ప్రాంతం గతంలో సాగు, తాగునీటి కష్టాలు ఎదుర్కొంది. రైతుల ఆత్మహత్యలు, వలసలు అధికంగా జరిగాయి.
హంద్రీనీవా, గాలేరు నగరి ప్రాజెక్టులను ఎన్టీఆర్ ప్రారంభిస్తే వాటిని పూర్తి చేసిన ఘనత వైఎస్ రాజశేఖరరెడ్డిది.
గతంలో రాయలసీమ ఉద్యమానికి వైఎస్ఆర్ నాయకత్వం వహించారు.
వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎం అయ్యాక పోతిరెడ్డిపాడు సామర్థ్యంను 11 వేల క్యూసెక్కుల నుంచి 44 వేల క్యూసెక్కులకు పెంచి రోజుకు 4 టీఎంసీలు తరలించేలా చేశారు.
రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ ప్రభుత్వం కొత్త ప్రాజెక్టులతో పాటు ఉన్న ప్రాజెక్టుల సామర్థ్యాన్ని కూడా పెంచుకుంది. పాలమూరు రంగారెడ్డి, దిండి వంటి ప్రాజెక్టులు నిర్మించారు.
శ్రీశైలం ప్రాజెక్ట్ నుంచి 788 అడుగులకే తెలంగాణ ప్రభుత్వం నీటిని తోడేస్తున్నా చంద్రబాబు అడ్డుకోలేకపోయారు.
2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక ముందు చూపుతో రాయలసీమ ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టారు.
పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ సామర్థ్యాన్ని 80 వేల క్యూసెక్కులకు పెంచిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిది.



రాయలసీమ ఎత్తిపోతల పథకం ద్వారా తెలుగు గంగ, గాలేరు నగరి, కేసీ కెనాల్ వెలుగోడు, సోమలశిల ప్రాజెక్టులకు మంచి జరిగే ఆలోచనను వైఎస్ జగన్ చేశారు.
రాయలసీమ లిఫ్ట్‌కు సంబంధించి ఎన్జీటీ అభ్యంతరాలు చెప్పినా అది కొత్త ప్రాజెక్టు కాదని.. పోతిరెడ్డిపాడులో భాగమేనని సమాధానం ఇచ్చి రూ.990 కోట్లు ఖర్చు చేశారు.
2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే వరకు రాయలసీమ ఎత్తిపోతల పథకం పనులు జరిగాయి. చంద్రబాబు సీఎం అయ్యాక పనులు ఆగిపోయాయి.
ఎన్జీటీ అనుమతి లేకపోవడంతో రాయలసీమ లిఫ్ట్ పనులు ఆపేశారని అంతా అనుకున్నారు. కానీ ఇటీవల తెలంగాణ అసెంబ్లీలో రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి హోదాలో తెలంగాణ ప్రయోజనాలు కాపాడడం కోసం చంద్రబాబుతో మాట్లాడి రాయలసీమ ఎత్తిపోతల పథకన్ని ఆపేయించానని చెప్పారు.
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు.. రేవంత్ రెడ్డి మాటలను ఖండిస్తారనుకుంటే దానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు.
20 టీఎంసీల కోసం రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ అవసరమా? అని ప్రశ్నించేలా చంద్రబాబు మాట్లాడడం దురదృష్టకరం.
వ్యవసాయమే దండగ అనే అభిప్రాయం ఉన్న వ్యక్తి చంద్రబాబు
శ్రీశైలం నుంచి 800 అడుగుల నుంచే నీటిని తీసుకెళ్లకపోతే రాయలసీమ ఎడారిబారిన పడుతుంది.
శ్రీశైలం ప్రాజెక్ట్‌కు వరద ఉండేది 40 రోజులే. ఈ సమయంలోనే 40 టీఎంసీలు తీసుకురావాలి. హంద్రీనీవా సామర్థ్యం 3850 క్యూసెక్కుల ఉంటే అది సాధ్యం కాదు. రోజుకు ఒక టీఎంసీ తీసుకెళ్లేలా చేయాలంటే హంద్రీనీవా సామర్థ్యంను 11 వేల క్యూసెక్కులకు పెంచాలి.
అమరావతికి లక్ష కోట్లు తెస్తున్నారు. కానీ, రాయలసీమ ప్రయోజనాల విషయంలో మాత్రం నిర్లక్ష్యం చేస్తున్నారు.
బడ్జెట్‌లో హంద్రీనీవాకు 2400 కోట్లు కేటాయించాం అంటున్నారు. ఈ నిధుల్లో సగం ప్రాజెక్ట్ నిర్వహణకే సరిపోతాయి.

హంద్రీనీవా 34, 35 ప్యాకేజీలు తక్షణం పూర్తి చేయాలి. డిస్ట్రిబ్యూటర్ల నిర్మాణం చేపట్టాలి.
ఇప్పటికే తుంగభద్ర నుంచి నీళ్లు తక్కువగా వస్తున్నాయి. ఇలాంటి సమయంలో కృష్ణా జలాలను అధికంగా తీసుకురావాల్సిన అవసరం ఉంది.
రాయలసీమలో సాగునీటి సమస్యలపై అన్ని రాజకీయ పార్టీలను కలుపుకుని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఉద్యమం చేపడుతోంది.
రాయలసీమలోని ప్రజాప్రతినిధులు మాపై విమర్శలు చేయడం మాని సీమ ప్రయోజనాల కోసం సీఎంపై ఒత్తిడి తీసుకురండి. అందరూ కలిసి మన ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకుందాం.

విశ్వేశ్వరరెడ్డి కామెంట్స్ :

రాయలసీమ ప్రాంత ప్రజలకు జలవనరుల విషయంలో చైతన్యంవంతుల్ని చేస్తాం.
ఆల్మట్టి డ్యాం ఎత్తు పెంచడం వల్ల రాయలసీమ భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతుంది.
రాష్ట్ర, రాయలసీమ ప్రయోజనాల విషయంలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డితో రాజీ పడి చంద్రబాబు ద్రోహం చేయడాన్ని తీవ్రంగా పరిగణించాలి.
చంద్రబాబు చర్యల కారణంగా రాయలసీమ ప్రాజెక్టులకు ప్రమాదం ఏర్పడుతోంది.
చంద్రబాబు సీఎం అయ్యాక గత ప్రభుత్వాలు చేపట్టిన మంచి పనులను అడ్డుకోవడం దుర్మార్గం.
రాయలసీమ ప్రాజెక్ట్ విషయంలో అదే జరుగుతోంది. ఈ ప్రభుత్వం వచ్చాకే కోర్టుల నెపం పెట్టి ప్రాజెక్ట్‌ను ఆపేశారు.
హంద్రీనీవా ద్వారా 40 టీఎంసీలు తెచ్చామని మంత్రులు గొప్పలు చెబుతున్నారు. వాస్తవానికి హంద్రీనీవాపై ప్రతిపాదిత ప్రాజెక్టుల కోసం 65 టీఎంసీలు అవసరం. దీన్ని గుర్తించే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో హంద్రీనీవా సామర్థ్యాన్ని 6000 క్యూసెక్కులకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. టెండర్లు కూడా పూర్తయ్యాయి. వైఎస్ జగన్‌పై కోపంతో చంద్రబాబు సీఎం అయ్యాక హంద్రీనీవా సామర్థ్యంను కుదించేశారు.

శైలజానాథ్ కామెంట్స్ :

రాయలసీమ ఎత్తిపోతల పథకం ఎందుకు పనికొస్తుంది? అనేలా చంద్రబాబు మాట్లాడుతున్నారు.
తెలంగాణ ప్రభుత్వం శ్రీశైలం ప్రాజెక్ట్‌లో 780 అడుగుల నుంచే నీళ్లు తరలిస్తోంది.
రాయలసీమ ప్రజలను చంద్రబాబు మభ్యపెడుతున్నాడు.
వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హంద్రీనీవా సామర్థ్యం పెంచితే చంద్రబాబు వచ్చాక మళ్లీ తగ్గించడం ద్రోహమే.
రాయలసీమ గొంతు తడవాలంటే సీమ ఎత్తిపోతల పథకం పనులు పూర్తి చేయాలి. ఇప్పటికే 90 శాతం పనులు అయ్యాయి. మోటార్లు బిగించాలి.
గతంలో కూడా రాయలసీమకు వచ్చిన ఎయిమ్స్‌ను మంగళగిరికి తరలించారు. కర్నూలు నుంచి హైకోర్టు.. కడప నుంచి సహకార బ్యాంకు తరలించారు. ఉక్కు పరిశ్రమకు ఊసే లేకుండా చేశారు.
రాయలసీమ నీటి అవసరాలు తీర్చేలా ప్రభుత్వ విధానాలు, నిధుల కేటాయింపులు ఉండాలి. ఇందుకోసం ఉద్యమిస్తాం

## బాల్య వివాహ ముక్తా భరత్

కూడేరు, ఫిబ్రవరి 18 (అనంత ప్రభ)
కూడేరు మండల పరిధిలోని కలగళ్ల గ్రామపంచాయతీలో నందు బుధవారం రోజు గ్రామ సర్పంచ్ సువర్ణమ్మ అధ్యక్షతన ఐసీడీస్ సూపర్వైజర్ సురేఖమ్మ, హెచ్ఎం శైలజ, డిస్టిక్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ కౌన్సిలర్స్ సంధ్య,
డిస్టిక్ చైల్డ్ ప్రొటెక్షన్ యనిట్ అవుట్ రీచ్ వర్కర్ రమాదేవి పంచాయతీ సెక్రెటరీ చంద్రమోహన్,
మహిళా పోలీస్ లక్ష్మి, అంగన్వాడీ వర్కర్స్ ఆశా వర్కర్స్ పిల్లల తల్లిదండ్రులతో కలసి బాల్యావివాహాల నిర్మూలనకు 100 రోజుల జాతీయ ప్రచార కార్యక్రమం పై సమీక్ష సమావేశాన్ని నిర్వహించడం జరిగింది. భారత ప్రభుత్వం మరియు రాష్ట్ర ప్రభుత్వం బాల్య వివాహల నివారణకు ప్రత్యేక చట్టాలు మరియు కార్యక్రమాలు అమలు చేస్తున్న బాల్యావివాహాలు బాలికల ఆరోగ్యం విద్య భవిష్యత్తు మరియు సమాజాభివృద్ధికి తీవ్రంగా హానికరమని గ్రామసభ గుర్తించినది అందువల్ల ఈ గ్రామసభ ఈ క్రింది విధంగా తీర్మానించుచున్నది కలగళ్ల గ్రామపంచాయతీ పరిధిలోనే 18 సంవత్సరాల లోపు బాలికలు మరియు 21 సంవత్సరాల లోపు బాలురకు వివాహాలు జరగకుండా పూర్తిగా నివారించుటకు గ్రామ మొత్తము బాధ్యత తీసుకుంటుంది. ఈ గ్రామంలో ఎలాంటి బాలు వివాహాలు జరగనివ్వమని జరుగుచున్నట్లయితే వెంటనే చట్టబద్ధ చర్యలు తీసుకునేలా సంబంధిత అధికారులకు సమాచారం అందించబడుతుంది. బాల్య వివాహాల నివారణలో గ్రామ సర్పంచ్ వార్డు సభ్యులు అంగన్వాడి కార్యకర్తలు ఉపాధ్యాయులు స్వయం సహాయక



సంఘాలు మరియు యువజన సంఘాలు కమిటీ మెంబర్స్ గ్రామస్తులు అందరు కలిసి చిన్న వయసు పెళ్లి జరిగినట్టయితే రెండు సంవత్సరాలు జైలు శిక్ష లక్ష రూపాయల జరిమానా విధించడం జరుగుతుందని కాబట్టి గ్రామంలో ఎక్కడైనా చిన్న వయసులో పెళ్లిళ్లు జరిగితే కచ్చితంగా 1098 కి కాల్ చేసి అధికారులకు సందేశాన్ని ఇవ్వాలిని వీటి వల్ల కలిగే అనర్థాల గురించి అలాగే పిల్లల హక్కులు మరియు పౌష్టికాహారం పరిశుభ్రత అలాగే ఫీల్ డెవలప్మెంట్ ఆరోగ్యం పోషణ విద్య యువతి అభివృద్ధి గురించి వివిధ అంశాల పట్ల అవగాహన విద్యార్థులకు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సువర్ణమ్మ, హెచ్ఎం శైలజ, ఐసిడిఎస్ సూపర్వైజర్ సురేఖమ్మ, మహిళా పోలీస్ లక్ష్మి , పంచాయతీ సెక్రెటరీ చంద్రమోహన్, ఐసీపీఎస్ సంధ్య డీసీపీయు రమాదేవి, అంగన్వాడి వర్కర్స్ ఈ కార్యక్రమంలో ప్రజలు పాల్గొన్నారు

## తరిమెల నాగిరెడ్డి జయంతి వాల్ పోస్టర్స్ విడుదల

శింగనమల, ఫిబ్రవరి 18 (అనంత ప్రభ)
అనంతపురం జిల్లా సింగనమల మండలం నిదనవాడు సుంకులమ్మ గుడి దగ్గర అఖిల భారత రైతు కూలి సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించుకోవడం జరిగింది ఈ సంఘం యొక్క ఉద్దేశం అజెండాలో భాగంగా ఫిబ్రవరి 23 వ తారీఖున 2026 సంవత్సరం రాష్ట్ర పిలుపుమేరకు గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని సవరణ చేస్తూ ఈ ప్లేస్ లో జి రాంజీ చట్టాన్ని పేరు తీసుకురావడం జరిగింది ఈ కేంద్ర ప్రభుత్వం తీసుకున్నటువంటి నిర్ణయాన్ని ఖండిస్తూ మునుపటి పాత చట్టాల్ని అమలు చేయాలని జిరాంజీ ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేయాలని మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయాలని మా యొక్క ముఖ్య ఉద్దేశం అంతేకాకుండా ఈ కేంద్ర ప్రభుత్వం పేద ప్రజలు కడుపు కొడుతూ పెత్తందారులకు భూస్వాములకు ఆదాని అంబానీలకు అనుకూలంగా వ్యవహరించడం జరుగుతుంది . మనదేశంలో పేద బడుగు బలహీన వర్గాల పక్కన పెడుతూ పేదల కడుపున కొడుతున్నాడు ఈ నరేంద్ర మోడీ ప్రభుత్వం కాబట్టి అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర పిలుపుమేరకు ఈనెల 23వ తారీఖున ఫిబ్రవరి నెల 26 సంవత్సరం ప్రతి ఒక్క మండలంలో ఎమ్మార్వో నిమరాండం ఇవ్వాలని నిర్ణయించుకున్నారు దీంట్లో భాగంగానే మార్చు రెండో తారీఖున దేశం మొత్తం ప్రతి రాష్ట్రంలో ప్రతి జిల్లాలో కలెక్టర్ ఆఫీస్ దగ్గర పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమాలు ఆందోళన కార్యక్రమాలు చేయాలని నిర్ణయించుకోవడం జరిగింది
అదేవిధంగా ఈనెల 25వ తారీఖున ఫిబ్రవరి 2026 సంవత్సరం కూడేరు మండలంలో తరిమెల నాగిరెడ్డి జయంతి జరుపుకోవడం జరుగుతుంది దాంట్లో



భాగంగానే వాల్ పోస్టర్స్ విడుదల చేయడం జరిగింది కాబట్టి గ్రామస్థాయి నుంచి మండల స్థాయిల నుంచి పెద్ద ఎత్తున 1000 మంది దాకా కూడేరుకి వచ్చి నాగిరెడ్డి జయంతిని విజయవంతం చేయాలని ప్రతి ఒక్క కామ్రేడ్ కి పిలుపునివ్వడం జరిగింది అఖిలభారతి రైతు కూలి సంఘం జిల్లా కార్యదర్శి నాగరాజు మాట్లాడడం జరిగింది అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కృష్ణ ఐఎఫ్టీయూ జిల్లా కమిటీ సభ్యుడు ఎర్రి స్వామి అఖిల భారత రైతు కూలి సంఘం జిల్లా కమిటీ సభ్యుడు రామాంజనేయులు మాట్లాడడం జరిగింది మరియు కమిటీ సభ్యులు లక్ష్మీ రంగయ్య శంకర్ శ్రీనివాసులు సూరి నాగభూషణం దైవత్వం నాగమణి సుదర్శన్ ఓబులేసు నరసయ్య రాజశేఖర్ తదితరులు పాల్గొనడం జరిగింది

## జిల్లా కేంద్రంలోని కొవ్వూరు నగర్ హత్య కేసు 24 గంటల్లోనే ఛేదింపు...ఆరుగురు నిందితులు అరెస్టు

అనంతపురం, ఫిబ్రవరి 18 (అనంత ప్రభ)
అనంతపురం కొవ్వూరు నగర్ ప్రాంతంలో 16.02.2026 వ తేదీన రాత్రి సుమారు 9.30 గంటల సమయంలో జరిగిన గౌసియా బేగమ్ హత్య కేసును పోలీసులు 24 గంటల వ్యవధిలోనే ఛేదించారు.
మొదటి నిందితుడు మల్కి జాఫర్ తన భార్యతో హత్యకు గురైన గౌసియా బేగమ్ కుమారుడు ఇమ్రాన్ ఖాన్ సన్నిహితంగా ఉన్నాడనే అనుమానంతో కుట్ర పన్నినట్లు విచారణలో వెల్లడైంది. ఈ నేపథ్యంలో 16.02.2026 వ తేదీన రాత్రి 9.30 గంటల సమయంలో తన బంధువులను బాధితురాలి ఇంటికి పంపించాడు. నిందితులు ఇమ్రాన్ ఖాన్‌ను కట్టెలతో కొట్టి హత్య చేయాలనే ఉద్దేశ్యంతో దాడి చేశారు. అదే సమయంలో అడ్డుగా వచ్చిన గౌసియా బేగమ్‌ను కూడా కట్టెలతో కొట్టి, కాలితో తన్నడంతో ఆమె స్పృహ కోల్పోయింది. వెంటనే ఆమెను అనంతపురము ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, వైద్యులు పరీక్షించి మరణించినట్లు నిర్ధారించారు.



ఈ ఘటనలో గౌసియా బేగమ్ కోడలు మరియు కుమారుడు ఇమ్రాన్ ఖాన్ గాయపడ్డారు. గాయపడిన ఇమ్రాన్ ఖాన్ 17.02.2026 న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు
అరెస్ట్ వివరాలు:

ఈరోజు ఉదయం 11.30 గంటల సమయంలో స్థానిక బళ్లారి బైపాస్ రోడ్డులోని ఎల్ ఐ సి కార్యాలయం వద్ద ఆరుగురు నిందితులను అనంతపురము ××× టౌన్ సి.ఐ రాజేంద్రనాథ్ అరెస్ట్ చేశారు.

## అనంతపురం జిల్లా కేంద్ర గ్రంథాలయానికి పుస్తకాల వితరణ

అనంతపురం, ఫిబ్రవరి 18 (అనంత ప్రభ)
సాంఘిక సంక్షేమ శాఖ కళ్యాణదుర్గం విశ్రాంత ఉపసంచాలకులు శ్రీ ఏ. సత్యనారాయణ గారు రచించిన పలు పుస్తకాలను ఉమ్మడి అనంతపురం జిల్లా గ్రంథాలయ సంస్థకు విరాళంగా అందజేశారు. బుధవారం జిల్లా గ్రంథాలయ కార్యాలయంలో జరిగిన ఒక కార్యక్రమంలో, ఆయన తాను రచించిన 'అక్షర విన్యాసములు', 'గేయములు–పాటలు' మరియు 'నిరుద్యోగి' అనే పుస్తకాలను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీ వడ్డే వెంకట్ గారికి స్వయంగా అందజేశారు.

ఈ సందర్భంగా చైర్మన్ వడ్డే వెంకట్ గారు మాట్లాడుతూ.. విశ్రాంత ఉద్యోగి అయి ఉండి కూడా సమాజం పట్ల బాధ్యతతో, అక్షర రూపంలో తన అనుభవాలను, ఆలోచనలను పుస్తకాలుగా మలిచి గ్రంథాలయానికి అందజేయడం అభినందనీయమని కొనియాడారు. ఈ పుస్తకాలు పాఠకులకు,




ముఖ్యంగా నిరుద్యోగ యువతకు ఎంతో స్ఫూర్తినిస్తాయని ఆయన పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శ్రీ పి. కమ్మన్న గారు, సీనియర్ అసిస్టెంట్ శ్రీ రాజు గారు, అసిస్టెంట్ లైబ్రేరియన్ శ్రీ డి. గోవిందు, జూనియర్ అసిస్టెంట్ శ్రీమతి హెచ్. రామాంజనమ్మ, రికార్డ్ అసిస్టెంట్ శ్రీమతి శ్రీ విజయ, ఆఫీస్ సబార్డినేట్ శ్రీమతి పి. శివమ్మ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## ఇంటి, నీటి పన్నులు సకాలంలో చెల్లించాలి




యాడికి, ఫిబ్రవరి 18 (అనంత ప్రభ )

యాడికి గ్రామపంచాయతీ పరిధిలో పన్ను వసూళ్లను వేగవంతం చేయడానికి డిప్యూటీ ఎంపీడీవో శశికళ, గ్రామపంచాయతీ అభివృద్ధి అధికారి సాయి అరుణ్ కుమార్ పిన్నేపల్లి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలను కలిసి ఇంటి పన్ను, నీటి పన్ను చెల్లింపులపై అవగాహన కల్పించారు. గ్రామాభివృద్ధికి పన్ను వసూళ్లు కీలకమని అధికారులు తెలిపారు. పన్నులు సకాలంలో చెల్లించడం వల్ల మౌలిక సౌకర్యాలను మెరుగుపరచడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రజలందరూ ఇంటి పన్ను, నీటి పన్నులు వెంటనే చెల్లించి గ్రామపంచాయతీ అభివృద్ధికి సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు


## సామాజిక బాధ్యతలో భాగంగా సాగర్ సిమెంట్స్ సేవా కార్యక్రమం




యాడికి, ఫిబ్రవరి 18 (అనంత ప్రభ)

బాలికా విద్యను ప్రోత్సహించే దిశగా సాగర్ సిమెంట్స్ లిమిటెడ్ (గుడిపాడు యూనిట్) తమ సామాజిక బాధ్యత కార్యక్రమాల్లో భాగంగా యాడికి మండలము పి. వెంగన్నపల్లి గ్రామంలోని జెడ్పి హైస్కూల్ లో చదువుతున్న 20 మంది విద్యార్థినులకు ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేసింది. దూర ప్రాంతాల నుంచి పాఠశాలకు వచ్చే విద్యార్థినులు రవాణా సౌకర్యం లేక చదువును మధ్యలో మానేసే పరిస్థితిని నివారించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు సాగర్ సిమెంట్స్ ప్రతినిధులు తెలిపారు. విద్యార్థినులు పదవ తరగతి పూర్తి చేసిన తర్వాత ఈ సైకిళ్లను పాఠశాలకు తిరిగి అప్పగించాలి. తద్వారా వచ్చే బ్యాచ్ విద్యార్థినులకు ఇవి ఉపయోగపడతాయి అని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి కాశప్ప, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, గ్రామ సర్పంచ్‌తో పాటు సాగర్ సిమెంట్స్ సిబ్బంది పాల్గొన్నారు. బాలికల విద్యాభివృద్ధికి దోహదపడే ఈ కార్యక్రమాన్ని గ్రామస్థులు అభినందించారు

## బ్రహ్మోత్సవాలకు ముస్తాబు అవుతున్న శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయ గోపురాలు



యాడికి ,ఫిబ్రవరి 18 (అనంత ప్రభ )

యాడికి మండల కేంద్రంలోని ప్రసిద్ధ శ్రీ శివ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో ఈ నెల 24వ తేదీ నుంచి ప్రారంభం కానున్న వార్షిక బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఆలయం ప్రత్యేక శోభతో అలంకృతం కానుంది. ఈ ఉత్సవాల ముందస్తు ఏర్పాట్లలో భాగంగా బుధవారం ఆలయ గోపురాల శుభ్రపరిచే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తాడపత్రి ఫైర్ స్టేషన్ సిబ్బంది ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజల సహకారంతో ఆలయ గోపురాలను నీటితో శుభ్రపరిచారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు ఆలయం సర్వాంగ సుందరంగా దర్శనమివ్వాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ఫైర్ సిబ్బంది, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొని శుభ్రత కార్యక్రమంలో తమ వంతు సహకారం అందించారు

## వీరారెడ్డిపల్లిలో గడ్డివాములకు నిప్పు, రైతులకు భారీ నష్టం



యాడికి, ఫిబ్రవరి 18 (అనంత ప్రభ)

యాడికి మండలం వీరారెడ్డిపల్లి గ్రామంలో రైతులకు చెందిన గడ్డివాములకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు అంటించడంతో భారీ నష్టం వాటిల్లింది. గ్రామానికి చెందిన లోకేపల్లి శ్రీనివాసులు రెడ్డి, లోకేపల్లి పుల్లారెడ్డి రైతులకు చెందిన గడ్డివాములు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ఘటనలో ఇద్దరు రైతులకు చెందిన గడ్డివాములు పూర్తిగా కాలిపోవడంతో దాదాపు 80 వేల రూపాయల వరకు నష్టం సంభవించినట్లు బాధిత రైతులు వాపోయారు. గుర్తు తెలియని వ్యక్తులే నిప్పు అంటించి ఉండవచ్చని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సమాచారం అందుకున్న స్థానికులు వెంటనే కాలుతున్న గడ్డివాములను అర్పడానికి ప్రయత్నం చేశారు

## శనివారం ఉదయం 10 గంటలకు కుల బాంధవుల సమావేశం ఏర్పాటు



మడకశిర, ఫిబ్రవరి 18 (అనంత ప్రభ)

నియోజకవర్గంలో కుంచిటీగ ఒక్కలిగ సంఘం కార్యవర్గ కాల పరిమితి ముగిసినందున నియోజకవర్గం లో కొత్త కార్యవర్గాన్ని ఏర్పాటు చేసుకొనుటకు చర్చించబడును అందుకుగాను మడకశిర నియోజకవర్గంలో ఉన్నటువంటి కుంచిటీ ఒక్కలిగా కుల బాంధవులందరూ తప్పకుండా హాజరు కావలసిందిగా పేరుపేరునా ప్రార్థించుచున్నాను

తేదీ:21/02/2026 శనివారం

సమయం: ఉదయం 10 గంటలకు

స్థలం: బేగార్లపల్లి క్రాస్ వద్ద నూతనంగా నిర్మిస్తున్న కుల బాంధవుల కళ్యాణమండపం మడకశిర

హలుకూరు కాంతరాజు,మాజీ గౌరవ అధ్యక్షులు కుంచిటీగా ఒక్కలిగా సంఘం మడకశిర

## నేటి నుంచి జిల్లా కోర్టు ఉద్యోగాల రాత పరీక్షలు, జిల్లా జడ్జ్ భీమారావు



అనంత, ఫిబ్రవరి 18 (అనంత ప్రభ)

అనంతపురం జిల్లా న్యాయ సేవా అధికార సంస్థలో ఉద్యోగాల భర్తీ కోసం వ్రాత పరీక్షలు అనంతపురం రుద్రంపేట పరిధిలోని శ్రీ బాలాజీ పీజీ కాలేజ్ పీవీకేకే ఇంజనీరింగ్ కాలేజీ ఆవరణ నందు ఈనెల 19-2-2026 తేదీన బుధవారం రోజున జరుగుతాయని ఉద్యోగార్తులు తమ తమ హాల్ టికెట్లు మరియు కావలసిన వస్తువులతో పాటు గంట ముందుగానే హాజరుకావాలని అనంతపురం జిల్లా ప్రధాన న్యాయమూర్తి మరియు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ అధ్యక్షులు శ్రీ ఈ భీమారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఫ్రంట్ ఆఫీస్ కోఆర్డినేటర్ పోస్ట్ కొరకు 12 గంటల 30 నిమిషాల నుండి వ్రాత పరీక్ష ప్రారంభమగునని కాలవ్యవధి 90 నిమిషములని మరియు రికార్డ్ అసిస్టెంట్ వ్రాత పరీక్ష 3 గంటల 30 నిమిషములకు ప్రారంభమగునని కాలవ్యవధి 90 నిమిషములని తెలియజేసినారు. అర్హులైన వారి పేర్లు జిల్లా కోర్టు వెబ్సైట్ నందు పొందుపరచడమైనదని అర్హులైన వారికి హాల్ టికెట్లు రాని ఎడల అనతపురము జిల్లా న్యాయ సేవా అధికార సంస్థకు ముందుగానే సంప్రదించగలరని అనంతపురం జిల్లా ప్రధాన న్యాయమూర్తి మరియు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ అధ్యక్షులు ఈ భీమారావు తెలిపారు.

## కేంద్రరాష్ట్రప్రభుత్వాలకు వ్యతిరేకంగా బడ్జెట్ పై 23వతారీఖున తహాశీల్దార్ కార్యాలయాలదగ్గరనిరసనలనుజయప్రధంచేయండి




శింగనమల, ఫిబ్రవరి 18 (అనంత ప్రభ)

కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరి 1న బడ్జెట్ ప్రవేశపెట్టింది. అదేవిధంగా ఫిబ్రవరి 14న రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టింది. ఈ రెండు బడ్జెట్లు వ్యవసాయ రంగానికి సరైన ప్రాధాన్యత ఇవ్వలేదు. వ్యవసాయ రంగానికి నిధుల కొరత కొట్టొచ్చినట్లు కనబడుతున్నది. అన్నదాత సుఖీభవ పథకం, విత్తన రాయితీ, పంటల బీమా పథకం,వడ్డీ రాయితీ,ఇరిగేషన్, ప్రకృతి విపత్తులు,ధరల స్థిరీకరణ, ప్రతిసంవత్సరము వ్యవసాయ రంగానికీ బడ్జెట్ లోనిధులు కేంద్రము తగ్గిస్తూ పర్టీలైజర్ మందులకు సబ్సిడీలు కోతలుకోస్తూ యూరియాను రైతులకు అదుబాటులో లేకుండా అన్యాయము చేస్తున్నది,. పి ఎం.కీసాన్ ప్రతిరైతుకు 6వేలునుండి 12వేలు ఇస్తామన్న ఇవ్వడములేదు రాష్టము అన్నదాత సుఖీభవ 20వేలు ఇవ్వాలి తదితర సంక్షేమ పథకాలపై ఈనెల 23వ తేదీన (సోమవారం) జిల్లావ్యాప్తంగా మండల కేంద్రాల్లో రైతుసంఘమ ఎఆద్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడాతాము కావున రైతులు,కౌలురైతులు కదలివచ్చి జయప్రధము చేయాలని పిలుపు నివ్వడమైనది. ఈ కార్యక్రమములో జిల్లా రైతు సంఘము నాయకులు బండి రామక్రిష్ణ, రవీంద్ర, చికెన్ బాషా, వీరనారప్ప తదితరులు పాల్గోనడమైనది

## ఏపీఎస్పీ బెటాలియన్ సిబ్బంది కి జీ.ఓ.329 అమలు చేసి, ఆదుకోండి .... అసెంబ్లీలో ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ వినతి



శింగనమల, ఫిబ్రవరి 18 (అనంత ప్రభ)

ఏపీఎస్పీ బెటాలియన్ సిబ్బంది కి జీ.ఓ.329 అమలు చేసి, ఆదుకోవాలని అసెంబ్లీ సాక్షిగా శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ వినతి చేశారు.

ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ మాట్లాడుతూ జీ.ఓ.329 అమలులో లేకపోవడం వల్ల ఏపీఎస్పీ సిబ్బందికి 10 ఏళ్ల సర్వీసు తర్వాత ఏఆర్ కానిస్టేబుల్ పదవికి 40% కోటా ఉన్నప్పటికీ గత వైసీపీ ప్రభుత్వంలో పూర్తిగా ఈ అవకాశాలు పట్టించుకోకపోవడం వల్ల 18 నుంచి 12 సంవత్సరాల సర్వీస్ ఉన్నప్పటికీ మార్పిడులు లేక ఇబ్బంది పడుతున్న పరిస్థితి సభ దృష్టికి తీసుకువచ్చారు. సిబ్బంది అంత సంవత్సరాల తరబడి కుటుంబాలకు దూరంగా ఉంటూ కష్టమైన పరిస్థితుల్లో సేవలు అందిస్తున్నారు. 6,12,18 సంవత్సరాలకు ఇచ్చే ఇంక్రిమెంట్లు కోల్పోవడమే కాకుండా మార్పిడులు తర్వాత ఏఆర్ కానిస్టేబుల్ 7 సంవత్సరాల జూనియర్గా చూపించడం వలన తగిన ప్రమోషన్లు కూడా పొందలేక కానిస్టేబుల్ గానే పరిస్థితిని చూస్తున్నాము. వారితో పాటు సివిల్ లో కానిస్టేబుల్ గా చేరిన వాళ్లలో సీఐ వరకు ప్రమోషన్స్ పొందే అవకాశాలు ఉన్నాయి కాబట్టి ఈ జీవో లో ఉన్న అవకాశాలు ఏపీఎస్పీ సిబ్బందికి కలిపించవలసిందిగా సంబంధిత మంత్రివర్యులు ను సభ సాక్షిగా ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ కోరారు.

## అట్టడుగు వర్గాల అభ్యున్నతికి అధికారులు అండగా ఉండాలి : హరి ప్రసాద్ యాదవ్



గుంతకల్లు, ఫిబ్రవరి 18 (అనంత ప్రభ)

గుంతకల్ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం ఘనంగా జరిగింది. ఈ సమావేశంలో గుంతకల్ రెవిన్యూ డివిజన్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ ఎస్ హరి ప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ అట్టడుగు వర్గాల అభ్యున్నతికి అధికారులు మరింత బాధ్యతగా పనిచేసి అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ఆర్డిటి సంస్థ కొన్ని దశాబ్దాలుగా విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో విశేష సేవలు అందించిందని, ప్రస్తుతం ఫారిన్ కాంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్ రెన్యువల్ కేంద్ర ప్రభుత్వం ఇవ్వకపోవడం వల్ల ఆ సంస్థ ఇతర దేశానికి తరలిపోయే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. అలా జరిగితే పేదలు, ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ కుటుంబాలు తీవ్రంగా నష్టపోతాయని వెంటనే రెన్యువల్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పేదల పాలిట వరంగా ఉన్న బత్తలపల్లి, కళ్యాణదుర్గం, కనేకల్ ప్రాంతాల ఆసుపత్రులను కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. గుంతకల్ పట్టణంలోని కసాపురం రోడ్డులో నిర్మాణం ప్రారంభమైన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భవన్ 63 లక్షల వ్యయంతో 2018లో పనులు మొదలైనప్పటికీ ఇప్పటికీ పూర్తి కాకపోవడం దురదృష్టకరమన్నారు. మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులకు గ్లౌజులు, షూస్, మాస్కులు వంటి రక్షణ సామగ్రి అందకపోవడం తీవ్ర నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులను కోరారు. సమావేశంలో ఆర్డీవో శ్రీనివాస్ మాట్లాడుతూ భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు పునరావృతమైతే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్సీ, ఎస్టీలపై వేధింపులు జరిగితే అట్రాసిటీ కేసులు నమోదు చేస్తామని డిఎస్పి ఆముదాల శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఎనిమిది మండలాలకు చెందిన సీఐలు, ఎస్సైలు, ఎమ్మార్వోలు, ఎంపీడీవోలు, ఎంఈఓలు మరియు వివిధ శాఖల అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను త్వరితగతిన అమలు చేయాలని, అట్టడుగు వర్గాల సంక్షేమానికి సమన్వయంతో పనిచేయాలని నిర్ణయించారు

## అనంతప్రభ దినపత్రిక నూతన క్యాలెండర్ ను ఆవిష్కరించిన ఇంచార్జ్ తహాశీల్దారు




కూడేరు, ఫిబ్రవరి 18 (అనంత ప్రభ)

కూడేరు మండల కేంద్రంలోని తహాశీల్దారు కార్యాలయం నందు బుధవారం రోజున " జేబీఎన్ న్యూస్ " అనంత ప్రభ "దినపత్రిక 2026 నూతన సంవత్సర క్యాలెండరును కూడేరు మండల ఇన్చార్జి తహాశీల్దారు ఉదయ భాస్కర్ చేతుల మీదుగా క్యాలెండర్ ను ఆవిష్కరించారు. నిజాలను నిర్భయంగా వ్రాస్తూ అనంత ప్రభ దినపత్రిక ద్వారా ప్రజలకు, సమాజానికి మంచి సందేశాన్ని అందించాలని ఇంచార్జ్ తాహాశీల్దారు ఉదయ్ భాస్కర్ కోరారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ తహాశీల్దారు ఉదయ్ భాస్కర్, సి ఎస్ డి టి శాంత కుమారి, విలేజ్ సర్వే రాము,అనంత ప్రభ దినపత్రిక ఉరవకొండ నియోజకవర్గం ఇన్చార్జ్ గుజ్జుల ఆదినారాయణ, సోషల్, రియల్ టెక్ అవేర్నెస్ ప్రధాన కార్యదర్శి ఏకీల ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఇప్పేరు గ్రామం లో పోలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించిన ఏవో శుభకర్



కూడేరు, ఫిబ్రవరి 18 (అనంత ప్రభ)

కూడేరు మండలం ఇప్పేరు గ్రామపంచాయతీలో మండల వ్యవసాయ అధికారి వారి సిబ్బందితో రైతుల పొలాలను పరిశీలించారు. వ్యవసాయంలో రైతులు మెలకువలను పాటించాలని పలు పంటల విధానాలపై ప్రత్యక్షంగా చర్చించి అవసరమైన సాంకేతిక సూచనలు అందజేయడం జరిగింది. పంటల సాగులో సమయానికి కలుపు నియంత్రణ, పోషక నిర్వహణ, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంట సంరక్షణ చర్యలపై అవగాహన కల్పించడం జరిగింది. అదేవిధంగా అనంతరగంగ గ్రామం లో వర్షాధారిత ప్రాంత అభివృద్ధి కార్యక్రమం కింద రైతులతో సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశంలో వర్షాధారిత పరిస్థితల్లో పాటించాల్సిన సాగు పద్ధతులు, తేమ సంరక్షణ చర్యలు, సమతుల్య ఎరువుల వినియోగం మరియు పంటల దిగుబడి పెంపుపై రైతులకు వివరించడం జరిగింది

## అనంతప్రభ దినపత్రిక నూతన క్యాలెండర్ ను ఆవిష్కరించిన త్రీ టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్



అనంత, ఫిబ్రవరి 18 (అనంత ప్రభ)

అనంతపురం జిల్లా కేంద్రంలోని త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ నందు బుధవారం రోజున " జేబీఎన్ న్యూస్ " అనంత ప్రభ "దినపత్రిక 2026 నూతన సంవత్సర క్యాలెండరును త్రీటౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజేంద్రప్రసాద్ యాదవ్, పుట్టపర్తి క్రైమ్ బ్రాంచ్ సిఐ చేతుల మీదుగా క్యాలెండర్ ను ఆవిష్కరించారు. నిజాలను నిర్భయంగా వ్రాస్తూ అనంత ప్రభ దినపత్రిక ద్వారా ప్రజలకు, సమాజానికి మంచి సందేశాన్ని అందించాలని త్రీ టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజేంద్ర ప్రసాద్ యాదవ్ కోరారు. ఈ కార్యక్రమంలో త్రీ టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజేంద్ర ప్రసాద్ యాదవ్, పుట్టపర్తి క్రైమ్ బ్రాంచ్ సిఐ అనంతపురం జేబీఎన్ న్యూస్ అనంత ప్రభ దినపత్రిక జిల్లా స్టాపర్ త్యాగరాజు పులి,తదితరులు పాల్గొన్నారు.

## మామిడి ఫ్రూట్ బ్యాగ్స్ సబ్సిడీని సద్వినియోగం చేసుకోండి



- మామిడి ఎగుమతిలో ఫ్రూట్ బ్యాగ్స్ ప్రధానమైనవి
- మామిడి రైతులకు ఫ్రూట్ బ్యాగ్స్ సబ్సిడీ
- ఉద్యానవన అధికారిని యామిని

ఉరవకొండ, ఫిబ్రవరి 18 (అనంత ప్రభ)

ఉరవకొండ నియోజకవర్గం లోని మండలాలలో ఉద్యానవన శాఖ ద్వారా ప్రభుత్వం మామిడి రైతులకు ఫ్రూట్ బ్యాగ్స్ ను సబ్సిడీతో అందిస్తోందని ఉద్యానవన అధికారుని యామిని తెలిపారు. మామిడి పూత పిందే దశలో ఉన్నందున వాటికి ఎటువంటి చీడపీడలు ఆశించకుండా మామిడి తోటల్లో మామిడి కాయల (పండ్లు) యొక్క సైజు పరిమాణంతో పాటు మంచి నాణ్యత గల దిగుబడులు, ఎగుమతులకు అనుకూలంగా ఉండేందుకు ప్రభుత్వం ఫ్రూట్ బాగ్స్ ను సబ్సిడీతో మామిడి రైతులకు అందించనంది. ఆసక్తిగల మామిడి రైతులు ఫ్రూట్ బ్యాగ్స్ సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలని ఉద్యానవనాధికారిని యామిని తెలియజేశారు

## వైయస్సార్ సీపీ అనంతపురం జిల్లా నూతన కార్యాలయం పరిశీలన



అనంతపురం, ఫిబ్రవరి 18 (అనంత ప్రభ)

అనంతపురంలోని హెచ్ఎల్సీ కాలనీలో నిర్మాణంలో ఉన్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అనంతపురం జిల్లా నూతన కార్యాలయాన్ని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, పార్లమెంట్ పరిశీలకులు నరేష్‌రెడ్డి, సమన్వయకర్తలు సాకే శైలజానాథ్, విశ్వేశ్వరరెడ్డి, తలారి రంగయ్య, వై.వెంకట్రామిరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, మెట్టు గోవిందరెడ్డి, ఇతర నాయకులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన నిర్మాణ సామగ్రిని పరిశీలించారు. మెటీరియల్‌ను కూడా అక్కడి నుంచి తీసుకెళ్లినట్లు గుర్తించారు. సుమారు రూ.30 లక్షల వరకు ఆస్తినష్టం జరిగినట్లు నాయకులు తెలియజేశారు

## ముస్లింలకు రంజాన్ మాసం ఆరంభ శుభాకాంక్షలు తెలిపిన అనంత



అనంతపురం, ఫిబ్రవరి 18 (అనంత ప్రభ)

పవిత్ర రంజాన్ మాసం ప్రారంభం కావడంతో ముస్లిం సోదర సోదరీమణులందరికీ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. "రంజాన్ అంటే ఉపవాస దీక్ష మాత్రమే కాదు. మనిషిలోని చెడు భావనలను, అధర్మాన్ని, ద్వేషాన్ని రూపుమాపే గొప్ప పండుగ. బుధవారం సాయంత్రం నెలవంక దర్శనంతో మత సామరస్యానికి, భక్తి భావానికి ప్రఖ్యాతి గాంచిన విశిష్ట ఉపవాసాల మాసం ప్రారంభమైంది. ముస్లిం సోదర, సోదరీమణులందరికీ 'ఈద్ కా చాంద్ ముబారక్'" అని పేర్కొన్నారు

## కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో యథేచ్ఛగా ఇసుక దందా ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి

ఆలూరు, ఫిబ్రవరి 18 (అనంత ప్రభ)

ఆలూరు నియోజకవర్గం హొళగుంద మండలం మార్లమడికి గ్రామంలో వేదవతి హగరి ప్రాంతాన్ని పరిశీలించిన ఆలూరు వైఎస్సార్సీపీ ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇసుక దందా విపరీతంగా పెరిగిందని ఆయన ఆరోపించారు. స్థానిక టీడీపీ నాయకులు ఒక్క ఇసుక ట్రాక్టర్‌కు రూ.500 వరకు అక్రమంగా వసూలు చేస్తున్నారని తెలిపారు. సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉచిత ఇసుక విధానాన్ని ప్రవేశపెట్టినా, కింది స్థాయి నాయకులు మాత్రం దందా కొనసాగిస్తున్నారని అన్నారు. ట్రాక్టర్ డ్రైవర్లు ఒక్క ట్రిప్‌కు రూ.500 చెల్లించకపోతే ఇసుకను బయటకు అనుమతించడం లేదని వెల్లడించారు. మండల అధికారులు దీనిపై స్పందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రోజుకు రూ.50 వేల నుంచి రూ.1 లక్ష వరకు అక్రమ వసూళ్లు జరుగుతున్నాయని, ఈ డబ్బులు ఎవరికి వెళ్తున్నాయో అర్థం కావడం లేదన్నారు. ఈ నిధులు నారా లోకేష్ లేదా స్థానిక టీడీపీ ఇంచార్జ్‌కు చేరుతున్నాయా అనే అనుమానాలు ఉన్నాయని పేర్కొన్నారు.



ఇల్లు నిర్మించుకోవడానికి ఇసుక కావాలంటే టీడీపీ కండువా వేసుకుంటే మాత్రమే అనుమతిస్తున్నారని, లేదంటే ట్రాక్టర్‌ను సీజ్ చేస్తామని బెదిరిస్తున్నారని ఆరోపించారు. స్థానిక ఎస్సై కూడా టీడీపీ నాయకులపై చర్యలు తీసుకోకుండా సాధారణ ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని అన్నారు.

ప్రజల ప్రయోజనాల కోసం అవసరమైతే ఇసుక దందా ఆగే వరకు ధర్నా చేస్తానని హెచ్చరించారు. ప్రజలకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

ఈ విషయాన్ని ఆదోని సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు మరియు బీవీఆర్ అభిమానులు పాల్గొన్నారు

## జిల్లా వ్యాప్తంగా వాహనాల తనిఖీలు



అనంతపురం, ఫిబ్రవరి 18 (అనంత ప్రభ)

జిల్లా ఎస్పీ శ్రీ పి. జగదీష్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పోలీసులు వాహనాల తనిఖీలు విస్తృతంగా నిర్వహించారు. ట్రాఫిక్ నియమాల ఉల్లంఘనలను అరికట్టడం, రోడ్డు భద్రతను మెరుగుపరచడం లక్ష్యంగా ఈ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకపోవడం, నాలుగు చక్రాల వాహనాల్లో సీట్‌బెల్ట్ వినియోగం, మద్యం సేవించి వాహనం నడపడం, అధిక వేగం, సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడపడం వంటి అంశాలపై ప్రత్యేకంగా తనిఖీలు నిర్వహించారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకున్నామని అధికారులు తెలిపారు. వాహనదారులు రోడ్డు భద్రతను దృష్టిలో ఉంచుకొని ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని సూచించారు

## పెద్ద తుంబలం గ్రామంలో కలుషిత తాగునీరు జ్వరాలు చర్మవ్యాధుల భయం

ఆదోని, ఫిబ్రవరి 18 (అనంత ప్రభ)

కర్నూలు జిల్లాలోని ఆదోని మండలం పరిధిలో ఉన్న పెద్ద తుంబలం గ్రామంలో కలుషిత తాగునీటి సమస్య తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఎదుట వదిలిపెట్టిన తాగునీటి పైప్‌లైన్ వాలు గత సంవత్సరం నుంచి మూసివేయకపోవడంతో మురికినీరు నిల్వే అదే తాగునీటి పైప్‌లైన్‌లో కలుస్తోందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఫలితంగా గ్రామానికి సరఫరా అవుతున్న నీరు దుర్వాసనతో, మురికిగా వస్తోందని వారు చెబుతున్నారు.

ఈ నీరు తాగడం వల్ల జ్వరాలు, కడుపు సంబంధిత వ్యాధులు, చర్మవ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని, ముఖ్యంగా చిన్నపిల్లలు మరియు వృద్ధుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే కొంతమంది అనారోగ్యానికి గురయ్యారని వారు తెలిపారు.

సమస్యపై పలుమార్లు సర్పంచ్ మరియు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే స్పందించి స్కూల్ ఎదుట వదిలిన పైప్‌లైన్ వాలను



మూసివేసి, తాగునీటి సరఫరా వ్యవస్థను సరిచేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అవసరమైనప్పుడు మాత్రమే పైప్‌లైన్ తెరిచి, తిరిగి సురక్షితంగా మూసివేయాలని కోరుతున్నారు.

ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని, లేకపోతే ఆందోళనకు దిగాల్సి వస్తుందని గ్రామస్థులు హెచ్చరిస్తున్నారు.

## వీధి కుక్కల బెడదతో పెద్ద తుంబలం గ్రామ ప్రజల్లో భయం -- చిన్నపిల్లల రక్షణకు చర్యలు తీసుకోండి



ఆదోని, ఫిబ్రవరి 18 (అనంత ప్రభ)

ఆదోని మండలం పెద్ద తుంబలం గ్రామంలో వీధి కుక్కలు విచ్చలవిడిగా తిరుగుతూ ప్రజలపై, ముఖ్యంగా చిన్నపిల్లలపై దాడులు చేస్తున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీధి కుక్కల భయంతో చిన్నపిల్లలు స్కూళ్లకు వెళ్లడానికే భయపడుతున్న పరిస్థితి నెలకొంది. బయటకు వెళ్లాలన్నా గ్రామ ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

అంతేకాక, గ్రామంలో ఉన్న అనేక వీధి కుక్కలకు అంటు వ్యాధులు సోకినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వీటి వల్ల ప్రజలకు, చిన్నపిల్లలకు కూడా వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. వెంటనే అధికారులు స్పందించి వీధి కుక్కల సమస్యపై తగిన చర్యలు తీసుకొని గ్రామ ప్రజలను, చిన్నపిల్లలను రక్షించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

వీధి కుక్కల బెడద నుంచి గ్రామాన్ని కాపాడేందుకు శాశ్వత పరిష్కారం చూపాలని పెద్ద తుంబలం గ్రామ ప్రజలు నమ్రంగా కోరుతున్నారు

## ఆర్టీసీ బస్సులో మరిచిపోయిన బ్యాగ్‌ను గంటలోనే కనుగొని బాధితురాలికి అందించిన ఆదోని టౌన్ పోలీసుల చాకచక్యం

ఆదోని, ఫిబ్రవరి 18 (అనంత ప్రభ)

ఈ రోజు కౌతాలం నుంచి ఆదోని వైపు ఆర్టీసీ బస్సులో ప్రయాణించిన ఒక బాధితురాలు విశాల్ మార్ట్ వద్ద బస్సు దిగిన తర్వాత తన బ్యాగ్ బస్సులోనే మరిచిపోయిన విషయం గుర్తించింది. వెంటనే ఆమె ఆర్టీసీ బస్ స్టాండ్‌కు వెళ్లి డ్రైవర్‌ను సంప్రదించి బస్సులో వెతికినా బ్యాగ్ కనిపించలేదు. అనంతరం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో ఆదోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ సీఐ పి. చంద్రశేఖర్ వద్ద ఫిర్యాదు చేసింది.

సీఐ ఆదేశాల మేరకు హెడ్ కానిస్టేబుల్ బ్రహ్మానంద రెడ్డి, కానిస్టేబుల్ సజ్జన్, విజయ్ కుమార్‌లు వెంటనే చర్యలు చేపట్టి సీసీ కెమెరా దృశ్యాలను పరిశీలించారు. అలాగే బస్సు డ్రైవర్ ఇచ్చిన సమాచారాన్ని ఆధారంగా తీసుకుని పట్టణంలోని పలు ప్రాంతాల్లో గాలింపు చేపట్టారు. పోలీసులు వేగంగా స్పందించి సాయంత్రం 4.30 గంటల సమయంలో బాధితురాలి బ్యాగ్‌ను గుర్తించి స్వాధీనం చేసుకుని ఆమెకు



అందజేశారు.

ఆ బ్యాగ్‌లో సుమారు ఆరు లక్షల రూపాయల విలువ చేసే నాలుగు తులాల బంగారు ఆభరణాలు ఉండగా అవి సురక్షితంగా తిరిగి లభించడంతో బాధితురాలు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపింది. ఈ సంఘటనలో ఆదోని టౌన్ పోలీసుల అప్రమత్తత, సమయస్ఫూర్తి, సేవా భావం మరోసారి ప్రతిఫలించింది

## దొడ్డనగిరి వద్ద నాటు సారాయి బట్టీ ధ్వంసం --- 10 లీటర్ల అక్రమ మద్యం స్వాధీనం


ఆదోని, ఫిబ్రవరి 18 (అనంత ప్రభ)

కర్నూల్ జిల్లా ఎస్పి విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు, ఆదోని డిఎస్పి హేమలత సూచనలతో, ఆదోని రూరల్ సి.ఐ నల్లప్ప స్వీయ పర్యవేక్షణలో పెద్దతుంబలం ఎస్.ఐ విద్యాశ్రీ తన సిబ్బంది పిసి-3603 కె. రంగస్వామి, రాజ-3637 కె. రామకృష్ణలతో కలిసి అక్రమ మద్యం రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక బృందంగా ఏర్పడి ఈరోజు (18-02-2026) ఉదయం సుమారు 5:30 గంటలకు విధుల్లో భాగంగా దొడ్డనగిరి గ్రామం బయట సిద్ధాపురం ఆంజనేయస్వామి గుడి సమీపంలోని గుట్ట ప్రాంతంలో తనిఖీలు చేపట్టారు.

తనిఖీల సమయంలో అక్కడ నాటు



సారాయి తయారీ జరుగుతున్న బట్టీ వద్ద ఉన్న ఒక వ్యక్తి పోలీసులను గమనించి అక్కడి నుంచి పారిపోయాడు. అనంతరం పోలీసులు ఆ ప్రాంతాన్ని పూర్తిగా పరిశీలించి, అక్కడ ఏర్పాటు చేసిన నాటు సారాయి ఊటను ధ్వంసం చేశారు. సంఘటనా స్థలంలో ఉన్న ప్లాస్టిక్ క్యాన్‌ను తనిఖీ చేయగా అందులో సుమారు 10 లీటర్ల నాటు సారాయి ఉన్నట్లు గుర్తించారు. ఆ అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు.



స్థానిక పొలాల వద్ద ఉన్న వారిని విచారించగా, ఆ బట్టి ఏర్పాటు చేసిన వ్యక్తి ఆదోని టౌన్‌కు చెందిన నాగరాజు కుమారుడు బోయ శివ అని గుర్తించారు. అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు

## బైపాస్ సర్జరీ శాశ్వత పరిష్కారం కాదు -- కొత్త బ్లాకేజీలపై అప్రమత్తత అవసరం : మెడికవర్ వైద్యుల కీలక సూచనలు

అనంతపురం, ఫిబ్రవరి 18 (అనంత ప్రభ)

బైపాస్ సర్జరీ (సి. ఏ. బి. జి ) చేయించుకున్న తర్వాత గుండె సమస్యలు పూర్తిగా తొలగిపోతాయని భావించడం ప్రమాదకరమని, కాలక్రమేణా కొత్త బ్లాకేజీలు ఏర్పడే అవకాశం ఉన్నందున నిరంతర వైద్య పర్యవేక్షణ తప్పనిసరి అని మెడికవర్ హాస్పిటల్స్ గుండె నిపుణులు వెల్లడించారు. తాజాగా అనంతపురం జిల్లాకు చెందిన డెబ్బై ఏళ్ల వృద్ధుడికి 17 ఏళ్ల తర్వాత మళ్లీ గుండె రక్తనాళాల్లో తీవ్రమైన బ్లాకేజీలు ఏర్పడిన కేసును విజయవంతంగా చికిత్స చేసిన సందర్భంగా ఈ వివరాలు తెలియజేశారు.

2008లో ట్రిపుల్ వెసెల్ బైపాస్ సర్జరీ చేయించుకున్న రోగి ఇటీవల తీవ్రమైన ఛాతీ నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందితో మెడికవర్ హాస్పిటల్స్‌లో చేరారు. ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ ప్రమోద్ కుమార్ కుచులకుంటి – చీఫ్ ఆఫ్ కార్డియాలజీ, డైరెక్టర్ స్ట్రక్చరల్ హార్ట్ ఽ అడ్వాన్స్‌డ్ కరోనరీ ఇంటర్వెన్షన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన యాంజియోగ్రామ్ పరీక్షల్లో గతంలో అమర్చిన గ్రాఫ్ట్‌లలో తీవ్రమైన బ్లాకేజీలు ఉన్నట్లు గుర్తించారు. అత్యాధునిక ఇవ్వస్. (ఐ వి యు ఎస్ )సాంకేతికత సహాయంతో రెండు స్టెంట్లను విజయవంతంగా అమర్చారు. ప్రస్తుతం రోగి కోలుకుని ఆరోగ్యంగా ఉన్నారు.

ఈ సందర్భంగా డాక్టర్ ప్రమోద్ కుమార్ కుచులకుంటి




మాట్లాడుతూ: "బైపాస్ సర్జరీ అనేది గుండె సమస్యలకు ముగింపు కాదు, ఒక దశలో చికిత్స మాత్రమే. శస్త్రచికిత్స అనంతరం కూడా రోగి జీవనశైలిలో మార్పులు చేయకపోతే, బీపీ, మధుమేహం, కొలెస్ట్రాల్ నియంత్రణలో లేకపోతే మళ్లీ బ్లాకేజీలు వచ్చే ప్రమాదం ఉంటుంది. ఛాతీ నొప్పి లేదా శ్వాస ఇబ్బందిని సాధారణ గ్యాస్ సమస్యగా తీసుకోవడం తీవ్రమైన పరిణామాలకు దారితీస్తుంది. క్రమం తప్పకుండా ఫాలో-అప్ పరీక్షలు చేయించుకోవడం ద్వారా మాత్రమే గుండెను దీర్ఘకాలం ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు." అని తెలిపారు.

క్రమం తప్పని వైద్య పరీక్షలు

బైపాస్ సర్జరీ తర్వాత ప్రతి సంవత్సరం గుండె చెకప్ చేయించుకోవాలి.

వైద్యుల సూచన మేరకు ఐదు ఏళ్లకు ఒకసారి యాంజియోగ్రామ్ చేయించుకోవడం మంచిది.

ఈసీజీ, ఈకో, టీఎమ్‌టి వంటి పరీక్షలను నిర్లక్ష్యం చేయకూడదు.

రక్తపోటు 120/80కు దగ్గరగా ఉంచుకోవాలి.

షుగర్ ఉన్నవారుఎచ్ బి ఏ.1సి స్థాయిని నియంత్రణలో ఉంచాలి.

చెడు కొలెస్ట్రాల్ (యల్ డి యల్ ) స్థాయిని తగ్గించడం అత్యంత ముఖ్యం.

రక్తం పల్చబడే మందులు (బ్లడ్ తినర్స్ ) వైద్యుల సలహా లేకుండా ఆపకూడదు.

మందులు మానేయడం వల్ల స్టెంట్ లేదా గ్రాఫ్ట్‌లో మళ్లీ గడ్డకట్టే ప్రమాదం ఉంటుంది.

తక్కువ నూనె, తక్కువ ఉప్పు, తక్కువ కొవ్వు ఉన్న ఆహారం తీసుకోవాలి.

పండ్లు, కూరగాయలు, గింజలు ఎక్కువగా తీసుకోవాలి.

రెడ్ మీట్, వేయించిన పదార్థాలు తగ్గించాలి.

రోజుకు కనీసం 30 నిమిషాలు నడక లేదా తేలికపాటి వ్యాయామం చేయాలి.

అధిక బరువు గుండెపై ఒత్తిడిని పెంచుతుంది.

ధూమపానం పూర్తిగా మానేయాలి.

మద్యం సేవించడం తగ్గించాలి లేదా పూర్తిగా నివారించాలి.

నిర్లక్ష్యం చేయకూడని లక్షణాలు:

ఛాతీలో ఒత్తిడి లేదా నొప్పి

మెడ, భుజం, ఎడమ చేతికి నొప్పి వ్యాపించడం

స్వల్ప శ్రమకే శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది

అసాధారణ అలసట

అకస్మాత్తుగా చెమటలు పట్టడం

"బైపాస్ సర్జరీ ఒక కొత్త ఆరంభం మాత్రమే. ఆరోగ్యకరమైన జీవనశైలి, క్రమబద్ధమైన పరీక్షలు మరియు మందుల వినియోగం ద్వారానే గుండెను దీర్ఘకాలం రక్షించుకోవచ్చు."

మెడికవర్ హాస్పిటల్స్ అత్యాధునిక క్యాథ్ ల్యాబ్ సదుపాయాలు మరియు అనుభవజ్ఞులైన గుండె నిపుణుల బృందంతో క్లిష్టమైన గుండె సమస్యలకు సమర్థవంతమైన చికిత్సను అందిస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటోంది.

# 250 ఏళ్ల కంపెనీకి బ్రాండ్ అంబాసిడర్‌గా శ్రీలీల.. రెమ్యునరేషన్ ఎన్ని కోట్లంటే?





కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన మైసూర్ శాండల్ సోప్‌కు స్టార్ హీరోయిన్ తమన్నా భాటియాను బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించడంపై కన్నడ సీమ రగిలిపోతోన్న సంగతి తెలిసిందే. దాదాపు 6.2 కోట్ల పారితోషికంతో తమన్నాకు ఈ బాధ్యతను కట్టబెట్టింది సిద్ధరామయ్య ప్రభుత్వం. అయితే కర్ణాటకలో ఎంతో మంది ప్రముఖులు, ప్రతిభావంతులు ఉండగా పరాయి రాష్ట్రానికి చెందిన నటిని మైసూర్ శాండల్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించడం వివాదానికి దారి తీసింది. కర్ణాటక సంఘాలు, పార్టీలు, ప్రముఖులు ప్రభుత్వ తీరును తప్పుబడుతున్నారు. ఈ క్రమంలో కర్ణాటకకి చెందిన యువ కథానాయిక శ్రీలీల అదిరిపోయే ఆఫర్ అందుకున్నారు. ఈ వివరాల్లోకి వెళితే..

చేతినిండా సినిమాలతో శ్రీలీల బిజీ ప్రస్తుతం టాలీవుడ్‌లో బిజీగా ఉన్న హీరోయిన్ ఎవరంటే ఖచ్చితంగా వినిపించే పేరు శ్రీలీల. ధమాకాతో లైమ్ లైట్‌లోకి వచ్చిన ఈ ముద్దగుమ్మ ఆ తర్వాత భగవంత్ కేసరి, గుంటూరు కారం వంటి భారీ బడ్జెట్ సినిమాల్లో అవకాశాలు దక్కించుకుంది. ఇక పుష్ప 2లో కిస్సిక్ సాంగ్‌తో దేశాన్ని ఊపేసి నేషనల్ వైడ్ పాపులర్ అయ్యింది. అందం, అభినయం, డ్యాన్స్‌తో క్రేజీ ఆఫర్లు పట్టేస్తోంది. చాలా చిన్న వయసులోనే బాలీవుడ్ ఆఫర్ కూడా అందుకోవడంతో శ్రీలీల అదృష్టంపై సీనియర్ హీరోయిన్లు, అప్ కమింగ్ హీరోయిన్లు అసూయ పడుతున్నారు. ఏళ్లుగా నిరీక్షిస్తున్న తమ వల్ల కానిది శ్రీలీల ఈజీగా సాధిస్తోందని కుళ్లుకుంటున్నారు.

ఆషికి 3తో బాలీవుడ్‌లోకి బాలీవుడ్ స్టార్ హీరో కార్తీక్ ఆర్యన్ సరసన ఆషికి 3 అనే సినిమా ద్వారా బాలీవుడ్‌లో అడుగుపెడుతున్నారు శ్రీలీల. అనురాగ్ బసు ఈ చిత్రానికి దర్శకుడు. దీపావళి కానుకగా ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ భావిస్తున్నారు. దీనిలో భాగంగా శరవేగంగా సినిమాను పరుగులు పెట్టిస్తున్నాడు అనురాగ్. అయితే అషికి 3 ఇంకా సెట్స్ మీద ఉండగానే శ్రీలీల హిందీలో మరో ఆఫర్ అందుకున్నట్లుగా వార్తలు వస్తున్నాయి. మరో స్టార్ హీరో సిద్ధార్థ్ మల్హోత్రా సరసన శ్రీలీల ఆడిపడనుందట. ఆనంద్ ఎల్ రాయ్ ఈ సినిమాను నిర్మిస్తుండగా.. రాజ్ సాండియాలా దర్శకత్వం వహిస్తారని బీటౌన్ టాక్. అయితే దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ఇక తెలుగులో జూనియర్, మాస్ జాతర, లెనిన్, తమిళంలో పరాశక్తి సినిమాలలో శ్రీలీల నటిస్తున్నారు.

టాప్ బ్రాండ్స్‌కు అంబాసిడర్‌గా సినిమా హిట్, ఫ్లాపులతో సంబంధం లేకుండా శ్రీలీల వరుస అవకాశాలు అందుకుంటున్నారు. ఇక బ్రాండ్ అండార్స్‌మెంట్స్‌తోనూ ఈ ముద్దుగుమ్మ భారీగా సంపాదిస్తోందట. న్యూడ్ స్కిన్ కేర్, అమృత గ్రూప్, ప్రెస్టా వుమెన్స్ వేర్, నీరూస్ తదితర బ్రాండ్స్‌కు శ్రీలీల అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నారు. తాజాగా శ్రీలీల అండార్స్‌మెంట్స్ కెరీర్‌లోనే మైల్ స్టోన్ అనదగ్గ ఆఫర్ వచ్చింది.

శ్రీలీలతో యూకే కంపెనీ డీల్ పర్సనల్ కేర్, కాస్మోటిక్స్, ఫ్రాగ్‌రెన్సెస్ విభాగంలో ప్రపంచంలోని అగ్రగామి సంస్థల్లో ఒకటైన యార్డ్లే లండన్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంపికయ్యారు. లండన్ కేంద్రంగా పనిచేస్తున్న ఈ కంపెనీకి దాదాపు 255 ఏళ్ల చరిత్ర ఉండగా.. ప్రపంచంలోని అత్యంత పురాతన కంపెనీల్లో ఒకటిగా యార్డ్లేకు పేరుంది. 2009లో యార్డ్లేను భారత కార్పోరేట్ దిగ్గజం విప్రో ఎంటర్‌ప్రైజెస్ కొనుగోలు చేసింది. ఇంతటి చరిత్ర కలిగిన ఈ సంస్థలోని ఫ్రాగ్‌రెన్సెస్ విభాగానికి గాను భారత్‌లో శ్రీలీల ప్రమోట్ చేయనుండటం విశేషం.

పారితోషికం ఎంతంటే? అయితే ఇందుకు గాను శ్రీలీల ఎంత మొత్తంలో పారితోషికం అందుకుంటున్నారన్నది తెలియరాలేదు. ప్రస్తుతం బ్రాండ్ ప్రమోషనింగ్ కోసం రూ.50 లక్షల నుంచి రూ.75 లక్షల మధ్య శ్రీలీల ఛార్జ్ చేస్తుండటంతో ఇది కూడా అదే స్థాయిలో లేదా ఆపైనా ఉండే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. యార్డ్లే నుంచి శ్రీలీల పారితోషికంగా ఎంత మొత్తం వసూలు చేస్తున్నారనే దానిపై త్వరలోనే మరిన్ని వివరాలు తెలిసే అవకాశం ఉంది.

## అనంత ప్రభ సినిమా

# చిరంజీవికి అలా.. బాలయ్యకు ఇలానా? అల్లు అరవింద్‌నే అడగండి..



మెగా ఫ్యామిలీ, అల్లు కుటుంబానికి మధ్య విభేదాలు తారాస్థాయికి చేరుకొన్నాయనే విషయాల గురించి మీడియాలో ఎక్కువగా చర్చ జరుగుతున్నది. ఈ రెండు కుటుంబాలు నర్మగర్భంగా మాట్లాడే తీరు ఆ వివాదాస్పద అంశానికి బలం చేకూరేలా కనిపిస్తుంటుంది. అయితే సాధారణ ప్రజలకు ఆ కుటుంబాల మధ్య గతంలో ఉన్న సఖ్యత, బంధాలు లేవనే అపోహ మాత్రం ఏర్పడింది. అయితే ఈ విషయాలపై రెండు కుటుంబాలకు ఆప్తుడైన తండేల్ నిర్మాత బన్నీ వాసు వెల్లడించిన వివరాల్లోకి వెళితే..

ఇటీవల కాలంలో అల్లు ఫ్యామిలీకి నందమూరి బాలకృష్ణ అత్యంత చేరువైనట్టు బయట వాళ్లకే కాకుండా సినిమా వర్గాలకు అనిపిస్తుంది. అయితే ఈ క్రమంలో బాలయ్యకు పద్మభూషణ్ అవార్డు రావడంపై అన్ని వర్గాల నుంచి స్పందన వ్యక్తమైంది. అయితే సినీ పరిశ్రమ ఈ సందర్భాన్ని పురస్కరించుకొని భారీ సమావేశాన్ని ఏర్పాటు చేసి.. ఆయనకు సన్మానం చేయాలనే ఆలోచనలో సినిమా పరిశ్రమ ఉందనే వార్త ఫిలిం నగర్‌లో చక్కర్లు కొడుతున్నది.


అయితే బన్నీ వాసును ఈ విషయంపై మెగాస్టార్ చిరంజీవికి పద్మభూషణ్ వస్తే ఎలాంటి సన్మానం చేయలేదు. మెగా హీరోలు, మెగా కుటుంబం పెద్దది అనే ఫీలింగ్ ఇండస్ట్రీలో ఉంది. ఆ సన్మాన కార్యక్రమాన్ని ఎందుకు నిర్వహించలేదని మీడియా అడిగిన ఓ ప్రశ్నకు ఆయన సరైన రీతిలో స్పందించారు.

పద్మ భూషణ్ అవార్డు అందుకొన్నందుకు చిరంజీవికి సన్మానం చేయకపోవడం.. బాలకృష్ణకు చేయాలనే ప్లాన్ చేయడం లాంటి విషయాలను అరవింద్ గారి లాంటి పెద్ద వాళ్లను అడిగితే బాగుంటుంది. అది చాలా పెద్ద విషయం. నా వయసుకు, నా స్థాయికి మాట్లాడే విషయం కాదు. అరవింద్ గారినే అడిగితే మంచింది. ఈ పరిస్థితుల్లో నేను ఏం మాట్లాడినా బాగుండదు. ఆ విషయం గురించి నేను మాట్లాడితే కరెక్ట్ కాదు అంటూ బన్నీ వాసు తప్పించుకొన్నారు.

నంద్యాల వివాదం తర్వాత నాకు, పవన్ కల్యాణ్‌కు మధ్య గ్యాప్ వచ్చిందనే విషయం సరికాదు. అందులో వాస్తవం లేదు. పవన్ కల్యాణ్ మెచ్యూరిటీ లెవెల్స్ వేరేగా ఉంటాయి. ఆయన ఇలాంటి విషయాలను మనసులో పెట్టుకోని చూడరు. ఎవరు ఏం చేస్తున్నారు? ఎవరు ఎలాంటి వారు? అనేది ఆయనకు ఫుల్లుగా క్లారిటీ ఉంది. నా విషయంలో ఆయన బన్నీతో కలిపి చూడరు. పార్టీకి ఏం చేస్తున్నాను? పార్టీ కోసం ఎలా ఉంటున్నారనేది ఆయన చూస్తారు అని బన్నీ వాసు వివరణ ఇచ్చారు.

# మహేష్ బాబు వదిలేసిన 1800 కోట్ల సినిమా.. థియేటర్లు బద్దలయ్యేవి.. ఆ మూవీ ఏంటంటే?





సూపర్ స్టార్ మహేష్ బాబు ప్రస్తుతం ఇండియాస్ బిగ్గెస్ట్ డైరెక్టర్ ఎస్ఎస్ రాజమౌళి దర్శకత్వంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం హైదరాబాద్ లోనే మూడవ షెడ్యూల్ జరుగుతోంది. చిత్రీకరణ విషయంలో మాత్రం జక్కన్న ఎస్. ఎస్. ఎం.బి 29 సినిమాను శరవేగంగా కొనసాగిస్తున్నారు. బాలీవుడ్ స్టార్ బ్యూటీ ప్రియాంక చోప్రా హీరోయిన్ గా నటిస్తున్న విషయం తెలిసిందే. మలయాళం సూపర్ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలో నటిస్తున్నారని తెలుస్తోంది. ఇదిలా ఉంటే మహేష్ బాబు చివరిగా గుంటూరు కారం చిత్రంతో ప్రేక్షకులను అలరించిన సంగతి తెలిసిందే. అది సూపర్ స్టార్ మహేష్ బాబు ఇప్పటివరకు రెగ్యులర్ క్యారెక్టర్లలోనే నటిస్తూ వచ్చారు. కానీ అభిమానులు మాత్రం ఆయనను పవర్ఫుల్ రోల్స్ లో చూడాలని ఎంతగానో ఆశిస్తున్నారు. ఈ క్రమంలోనే మహేష్ బాబు వదిలేసుకున్న 1870 కోట్ల సినిమా గురించి తాజాగా న్యూస్ బయటకు వచ్చింది. ఆ సినిమా చేసి ఉంటే మాత్రం మహేష్ బాబు ఇండియా ను షేక్ చేసే వారిని సినీ ప్రముఖులు అభిప్రాయపడుతున్నారు.

ఇంతకీ ఆ సినిమా ఏంటో తెలిస్తే అందరూ షాక్ అవ్వాల్సిందే. క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కాంబినేషన్లో వచ్చిన పుష్ప చిత్రమే కావడం విశేషం. అయితే ఈ సినిమాకు మొదట హీరోగా మహేష్ బాబు అని అనుకున్నట్టుగా ఇప్పుడు తెలుస్తోంది. కానీ మహేష్ బాబు ఆ సినిమాలు వదులుకోవడంతో అల్లు అర్జున్ వద్దకు వెళ్లిందని ఫిల్మ్ సర్కిల్స్ లో గుసగుసలు నడుస్తున్నాయి. ఇక అల్లు అర్జున్ టెర్రిఫిక్ పెర్ఫార్మెన్స్ తో పుష్ప, పుష్ప 2 చిత్రాలు ఎంతటి సెన్సేషన్ క్రియేట్ చేశాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు.

రీసెంట్ గా వచ్చిన పుష్ప 2 చిత్రం ఏకంగా బాక్సాఫీస్ రికార్డులను తిరగరాసింది. 1870 కోట్లు గ్రాస్ కలెక్ట్ చేసి ఇండియాలోనే హైయెస్ట్ గ్రాస్ కలెక్ట్ చేసిన రెండవ సినిమాగా రికార్డు సెట్ చేసింది. బాహుబలి 2 సాధించిన బాక్సాఫీస్ కలెక్షన్లు 1810 కోట్లను దాటేసి మరి ఈ రికార్డును సెట్ చేయడం సెన్సేషన్ గా మారింది. మన వైపు అల్లు అర్జున్ కు పుష్ప పాత్రలో నటించినందుకు ఏకంగా బెస్ట్ యాక్టర్ విభాగంలో నేషనల్ అవార్డు వరించిన సంగతి తెలిసిందే. ఇక నెక్ట్ పుష్ప 3 కూడా రాబోతుంది. ఆ పార్ట్ లో విజయ్ దేవరకొండ నటిస్తారని తెలుస్తోంది.

అయితే ఇంతటి సెన్సేషన్ క్రియేట్ చేసిన పుష్ప చిత్రాన్ని మహేష్ బాబు ఎందుకు వదులుకున్నారా అన్నది ఇప్పుడు మిలియన్ డాలర్ క్వశ్చన్ గా మారింది. అయితే పుష్ప చిత్రం ప్రారంభానికి ముందు మహేష్ బాబు ఇంట్లో వరుసగా విషాదాలు నెలకొనడం, గుంటూరు కారం చిత్రం తర్వాత ఎస్ఎస్ రాజమౌళి తో సినిమాకు కమిట్ అవ్వడమే కారణం అని తెలుస్తుంది. ఇక పుష్ప చిత్రమే కాదు, శంభాజీ మహారాజ్ జీవిత కథతో వచ్చిన చావా చిత్రాన్ని కూడా మహేష్ బాబు వదిలేసారంట. ఈ హిస్టారికల్ ఫిలిం లో మహేష్ బాబు నటించిన మాత్రం మరింత బీభత్సం సృష్టించే వారిని ఫ్యాన్స్ అభిప్రాయపడ్డారు. ఇలా తన ముందుకు వచ్చిన రెండు బ్లాక్ బస్టర్ మూవీస్ ను మహేష్ బాబు వదులుకోవడం ఆసక్తికరంగా మారింది. ఎస్. ఎస్. ఎం.బి 29 తో మాత్రం ఇండియన్ బాక్సాఫీస్ రికార్డులను చెల్లాచెదురు చేస్తారని ఫ్యాన్స్ నమ్ముతున్నారు. ఆ ప్రాజెక్టుకు మార్కెట్లోనూ భారీ డిమాండ్ ఉండింది.

# భైరవం మూవీ రివ్యూ అండ్ రేటింగ్

వీపురంలో జమీందార్ వంశానికి చెందిన గజపతి (మనోజ్ మంచు)కి గ్రామంలో పేరు ప్రతిష్టలు ఉన్నప్పటికీ.. పేదరికం వెంటాడుతుంటుంది. గజపతికి తన ఊరిలోనే పెద్దరికాన్ని ప్రదర్శించే వరద (నారా రోహిత్), అనాథగా బతికే శ్రీను (బెల్లంకొండ శ్రీను) ప్రాణస్నేహితులుగా ఉంటారు. ఇదిలా ఉండగా, ఆ గ్రామంలోని ఆలయ ధర్మకర్తగా గజపతి నానమ్మ (జయసుధ) ఉంటారు. ఆలయ భూములు కాజేయడానికి మంత్రి (శరత్ లోహితస్య) పన్నాగం పన్నుతాడు.

అనాథ అయినప్పటికీ శ్రీనును కన్నబిడ్డగా ప్రజలు ఎందుకు చూస్తారు? శ్రీనుతో వెన్నెల (అదితి శంకర) లవ్ ట్రాక్ ఎలా సాగింది? గజపతిని భార్య నీలిమ (ఆనంది) ఎలా వేధించింది. భార్య ఒత్తిళ్లకు గజపతి తన మనసును ఎలా మార్చుకొన్నాడు. ప్రాణస్నేహితులుగా ఉండే గజపతి, వరద, శ్రీను మధ్య మంత్రి ఎలా చిచ్చు పెట్టారు. వరద స్నేహం కోసం ప్రాణాలిచ్చేంత ప్రేమ ఉన్న గజపతి తన స్నేహితులకు ఎందుకు ఎదురు తిరిగాడు? వరద, గజపతి, శ్రీను మధ్య విభేదాలు ఎలాంటి పరిస్థితులకు దారి తీశాయి? అనే ప్రశ్నలకు సమాధానమే భైరవం సినిమా కథ.

పోలీస్ ఇన్స్‌పెక్టర్ (సంపత్ రాజ్) తన ఉద్యోగానికి రాజీనామాను పై అధికారికి సమర్పించడంతో సినిమా హై నోట్‌లో మొదలవుతుంది. తన రాజీనామాకు కారణం చెప్పడం మొదలు పెట్టడంతో దేవీ పురంలో ముగ్గురు ప్రాణ స్నేహితుల కథను ఎమోషనల్‌గా దర్శకుడు ప్రారంభించాడు. ముగ్గురు హీరోల ఇంట్రడక్షన్, ఎలివేషన్స్‌ను బాగానే డిజైన్ చేశాడు. ఆ తర్వాత శ్రీను ప్రేమ కథ, వరద, గజపతి ఫ్యామిలీ మధ్య ఉండే అన్యోన్యతను, కథను ఎస్టాబ్లిష్ చేయడానికి కాస్త టైమ్ ఎక్కువగా తీసుకొన్నట్టు అనిపిస్తుంది. ఫస్టాఫ్‌ను రెగ్యులర్, రొటీన్ ఫార్మాట్‌తో నడిపించినప్పటికీ.. ఇంటర్వెల్ ముందు పవర్‌ఫుల్ ఎపిసోడ్‌తో తొలిభాగాన్ని ముగించి సెకండాఫ్‌పై ఆసక్తిని పెంచాడు.

అయితే ముగ్గురు హీరోల మధ్య ఎమోషన్స్, బాండింగ్‌ను బలంగా ఎస్టాబ్లిష్ చేయాల్సి ఉన్నప్పటికీ.. ఆ దిశగా ప్రయత్నం సరిగా చేయలేదనే ఫీలింగ్ కలుగుతుంది. భావోద్వేగంతో చెప్పాల్సిన సన్నివేశాల్లో యాక్షన్ నింపడం వల్ల సినిమాలో సోల్ కాస్త మిస్ అయిందనిపిస్తుంది. ఇలాంటి లోపాలు ఉన్నప్పటికీ.. మామిడితోట సీన్ నుంచి మూవీలో సన్నివేశాలు నెక్ట్స్ రేంజ్‌లోకి వెళ్తాయి. క్లైమాక్స్ సన్నివేశాలను చిత్రీకరించిన తీరు విజయ్ కనకమేడల ప్రతిభ ఎంతో తెలుస్తుంది. సెకండాఫ్‌ను ఇంకాస్త బెటర్‌గా డిజైన్ చేయాల్సిందనే ఫీలింగ్ కలుగుతుంది. నటీనటుల ఫెర్ఫార్మెన్స్ విషయానికి వస్తే.. బెల్లంకొండ శ్రీనివాస్ ఈ సినిమాకు బ్యాక్ బోన్‌గా నిలిచాడు. సినిమాలోని ఎమోషనల్ కంటెంట్‌ను తన పాత్ర ద్వారా బాగా ఎలివేట్ చేశాడు. నటుడిగా మరింత మెచ్యురిటీని చూపించాడు. ప్రీ క్లైమాక్స్ నుంచి క్లైమాక్స్ సన్నివేశాల్లో తనలోని నట విశ్వరూపాన్ని చూపించే ప్రయత్నం చేశాడు. నారా రోహిత్, మనోజ్‌తో పాత్రలతో మమేకమై మంచి బాండింగ్‌ను ఆన్ స్క్రీన్‌పై ఎలివేట్ చేశాడు. ఇక మనోజ్ మంచు నటుడిగా మరో రేంజ్ పెర్ఫార్మెన్స్ చేశాడు. కాస్త విరామం తీసుకొన్నప్పటికీ.. సూపర్ క్యారెక్టర్‌తో రీ ఎంట్రీతో అదరగొట్టాడు. ఇండస్ట్రీలో తన టైమ్ స్టార్ట్ అయిందని గజపతి పాత్ర ద్వారా చాటి చెప్పాడు. నారా రోహిత్ విషయానికి వస్తే.. వరద పాత్రలో హుందాగా కనిపించాడు. తన పాత్రకు ఎంత ఎమోషన్ కావాలి? ఎంత యాక్షన్ కావాలో అంతే సమతుల్యాన్ని పాటించి సటిల్‌గా స్క్రీన్ పై కనిపించాడు. ఇక నాన్నమ్మగా జయసుధ పాత్ర అంతంత మాత్రమేగానే ఉన్నప్పటికీ.. స్క్రీన్ మీద కనిపించినంత సేపు ఆమె ప్రజెన్స్ బాగుంది. ఈ సినిమా కథను నడిపించే పాత్రలో నీలిమగా ఆనంది నటన బాగుంది. కేవలం గ్లామర్ పరంగానే కాకుండా ఆనంది పాత్రల స్వరూపాన్ని, సినిమా కథ దిశను మార్చే పాత్రలో ఒదిగిపోయింది. ఇక నారా రోహిత్ భార్య పాత్రలో పూర్ణిమగా దివ్య పిళ్లై ఎమోషనల్ కంటెంట్‌ను సినిమాకు అందించే విధంగా పెర్ఫార్మ్ చేశారు. వెన్నెల కిషోర్ కామెడీ పెద్దగా వర్క్ కాలేదు. సంపత్ రాజ్, శరత్, అజయ్, ఇతర పాత్రలు సినిమాలో గుర్తుంచుకొనే పాత్రల్లో కనిపించారు.

టెక్నికల్ అంశాల విషయానికి వస్తే.. ఈ సినిమాకు శ్రీ చరణ్ పాకాల మ్యూజిక్ ప్రధానమైన బలంగా మారింది. బ్యాక్ గ్రౌండ్ స్కోర్‌తోనే కాకుండా హీరోల ఇంట్రడక్షన్ సాంగ్ సంక్రాంతి పాట, అలాగే వెన్నెల, గిచ్చు గిచ్చు సాంగ్ ఆడియో పరంగా ఫుల్ జోష్‌ను కలిగిస్తే.. తెర మీద అదే జోష్‌ను చూపించారు. ఇక ఈ సినిమాలో మంచి మాస్ యాక్షన్ ఎపిసోడ్స్ ఉన్నాయి. వాటితో గ్రామంలోని వాతవరణాన్ని హరి కె వేదాంతం చక్కగా, చాలా సహజంగా చిత్రీకరించాడు. కేకే రాధామోహన్ ఈ మూవీని రాజీ లేకుండా మంచి క్వాలిటీతో సినిమాను అందించారు. ప్రొడక్షన్ వాల్యూస్ హై స్టాండర్డ్‌లో ఉన్నాయి. కంటెంట్‌పై మరింత దృష్టిపెట్టి ఉంటే బెస్ట్ మాస్ యాక్షన్ మూవీ అయి ఉండేదనిపిస్తుంది. తమిళంలో సూపర్ హిట్ అయిన గరుడన్ సినిమాకు భైరవం రీమేక్. ఈ సినిమాలో అన్ని రకాలు ఎమోషన్స్ ఉంటాయి. కొన్ని చోట్ల భావోద్వేగాలు లోపించాయి. యాక్షన్ పార్ట్ సినిమా ఫ్లేవర్‌ను మార్చేసింది. పాటల బాగున్నప్పటికీ వాటి ప్లేస్ మెంట్ సరిగా లేకపోవడం వల్ల మంచి ఫ్లోలో వెలుతున్న స్టోరికి బ్రేకులు వేశాయా? అనిపిస్తుంది. ఈ సినిమా పక్కా మాస్ ఎంటర్‌టైనర్. బెల్లంకొండ శ్రీను, నారా రోహిత్, మనోజ్ మంచు ఫెర్ఫార్మెన్స్ ఈ సినిమాకు హైలెట్. కథ పరంగా పాత కథే.. కాకపోతే డిఫరెంట్‌గా చేయాలన్న ప్రయత్నం కొంత ట్రాక్ తప్పింది. టోటల్‌గా ఈ సినిమాను థియేటర్‌లో ఓసారి చూసేయొచ్చు అనేది నా అభిప్రాయం.




PRINTED, PUBLISHED & and OWNED by T VIJAYANAND, And PRINTED at M/S JBN PUBLICATIONS, # 2/381-A - RAGITHOTA PALEM, Near SHALOM CHURCH, Tadipatri - 515411 Anantapuram District, Andra Pradesh. Published at M/S JBN PUBLICATIONS, # 2/381-A, RAGITHOTA PALEM, Near SHALOM CHURCH, Tadipatri - 515411 Anantapuram District, Andra Pradesh. PIN - 515411. Editor T VIJAYANAND, RNI NO: APTEL/2015/72694. Cell : 8886090199. E-mail ID : ananthaprabha@gmail.com